# యోహాను వ్రాసిన మొదటి పత్రిక

అపొస్తులుడైన యోహాను తన ఈ మొదటి పత్రికలో క్రైస్తవులను విశ్వాసములో బలపరచుటకు, ప్రభువును ప్రేమించాలని, ప్రతి ఒక్కరు తననువలె తన పొరుగువారిని ప్రేమించాలని బోధిస్తున్నాడు. ఈ పత్రికను క్రీ॥శ॥ 84-95 సం॥ల మధ్యకాలములో వ్రాసి యుండవచ్చును.

### యోహాను వ్రాసిన మొదటి పత్రిక-అనుక్రమణిక

| | |
|---|---|
| 1:1-4 | క్రీస్తునందు ప్రత్యక్ష పరచబడిన నిత్యజీవము |
| 1:5-10 | దేవునితోడి అన్యోన్య సహవాసము - పాపమును విడచి పెట్టుట |
| 2:1-17 | విధేయత - సహవాసమునకు రుజువు |
| 2:18-29 | హెచ్చరికలు - క్రీస్తు విరోధులు |
| 3:1-12 | తండ్రి ప్రేమ నిత్యత్వమునకు నడుపును |
| 3:13-24 | సహోదర ప్రేమ |
| 4:1-6 | దేవుని ఆత్మ భ్రమపరచు ఆత్మ |
| 4:7-21 | దేవుని ప్రేమ - మనుష్యుని ప్రేమ |
| 5:1-12 | క్రైస్తవ విశ్వాసము |
| 5:13-21 | ముగింపు |

# యోహాను వ్రాసిన మొదటి పత్రిక 1వ అధ్యాయము

## క్రీస్తునందు ప్రత్యక్ష పరచబడిన నిత్యజీవము

జీవ వాక్యమును గూర్చినది, ఆది నుండి ఏది యుండెనో, మేమేది వింటిమో, కన్నులార ఏది
చూచితిమో, ఏది నిదానించి కనుగొంటిమో, మా చేతులు దేనిని తాకి చూచెనో, అది మీకు
తెలియజేయుచున్నాము. 2 ఆ జీవము ప్రత్యక్షమాయెను తండ్రి యొద్ద ఉండి మాకు ప్రత్యక్షమైన ఆ
నిత్యజీవమును మేము చూచి, ఆ జీవమును గూర్చి సాక్ష్యమిచ్చుచు, దానిని మీకు తెలియపరచుచున్నాము. 3
మాతో కూడ మీకును సహవాసము కలుగునట్లు మేము చూచిన దానిని వినిన దానిని మీకును తెలియజేయు
చున్నాము. మన సహవాసమైతే తండ్రితో కూడను, ఆయన కుమారుడైన యేసుక్రీస్తుతో కూడను నున్నది. 4
మన సంతోషము పరిపూర్ణమవుటకై మేమీ సంగతులను వ్రాయుచున్నాము.

## దేవునితో అన్యోన్య సహవాసము – పాపమును విడిచి పెట్టుట

5 మేమాయన వలన విని మీకు ప్రకటించు వర్తమాన మేమనగా– దేవుడు వెలుగై యున్నాడు
ఆయన యందు చీకటి ఎంత మాత్రమును లేదు. 6 ఆయనతో కూడ సహవాసము గలవారమని చెప్పుకొని
చీకటిలో నడచిన యెడల మన మబద్ధమాడుచు సత్యమును జరిగింపకుందుము. 7 అయితే ఆయన
వెలుగులోనున్న ప్రకారము మనమును వెలుగులో నడచినయెడల, మనము అన్యోన్య సహవాసము గలవారమై
యుందుము అప్పుడు ఆయన కుమారుడైన యేసురక్తము ప్రతి పాపము నుండి మనలను పవిత్రులనుగా
చేయును. 8 మనము పాపము లేని వారమని చెప్పుకొనిన యెడల, మనలను మనమే మోసపుచ్చు
కొందుము మరియు మనలో సత్యముండదు. 9 మన పాపములను మనము ఒప్పుకొనిన యెడల, ఆయన
నమ్మదగినవాడును నీతిమంతుడును గనుక ఆయన మన పాపములను క్షమించి సమస్త దుర్నీతి నుండి
మనలను పవిత్రులనుగా చేయును. 10 మనము పాపము చేయలేదని చెప్పుకొనిన యెడల, ఆయనను
అబద్ధికునిగా చేయువారమగుదుము, మరియు ఆయన వాక్యము మనలో ఉండదు.